# సింగిల్ పేజీ కథలు

''అయితే సుజీ... నువ్వు పవన్‌ని ప్రేమించనంటావ్?'' ఆరాగా అడిగాను సుజీని.

''అవునక్కా, అందుకే నాన్న పై చదువుల కోసమనో, కంప్యూటర్ కోర్సుకనో మీ ఊరుకి నన్ను పంపిస్తానంటే నీకు వీలు కాదని చెప్పు!''

''నేనెలా చెప్పనూ? నువ్వే చెప్పకపోయావా ఏదో విధంగా''

''సర్లే, ఆయనెదుట మాట్లాడాలంటేనే ఒళ్లంత చెమట్లు పడుతుంది. ఇక నిర్ణయాలు చెప్పడం కూడానా?'' చేతులు తిప్పుతూ అంది సుజి

''సుజీ... కేవలం పవన్‌ని చూడడం మిస్సవకుండా ఉండడం కోసం నీ ఫ్యూచర్‌ని పాడు చేసుకుంటావా?''

''ఫ్యూచర్ పాడేమౌతుంది ఇందులో?''

''మరి ఇంట్లో ఖాళీగా వుండి ఏం చేస్తావ్? అయినా పవన్‌ని ప్రేమించానని చెప్పే దానివి నాన్న మ్యాచెస్ చూస్తుంటే ఎందుకు వద్దని చెప్పడం లేదు రేపేదైనా సంబంధం కుదిరితే!''

''ఓహో అక్కా, ఈ అనుమానాలన్నీ ఇంతటితో ఆపెయ్. పవన్ తనకి ఏదో జాబ్ వచ్చేవరకు మా సంగతి ఇంట్లో చెప్పొద్దన్నాడు''

''అందుకే అప్పటి దాకా నువ్వు మా హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్స్ జాయినవ్వు!''

''అక్కా, మళ్లీ మొదటికే వచ్చావ్ నువ్వు'' సుజి విసుగ్గా మాట్లాడడం చూసే ఒళ్లు మండింది నాకు.

''నోర్మూయ్! నీకు మంచి చెప్తుంటే వినవే. మన లైఫ్ బాగుండాలన్నా, చెడిపోవాలన్నా ఈ టైమే నీకు ముఖ్యం. అదిగో, ఆ ఎదురింట్లో నా పెళ్లి కాకముందు ప్రభాకర్ వాళ్లుండే వాళ్లు, నీకు గుర్తుందా?'' తీవ్రంగా ప్రశ్నించాను.

గుర్తు లేదన్నట్లు తలాడించింది సుజి.

'సుజీ, నువ్వప్పుడు చాలా చిన్న పిల్లవి. వాళ్లు నీకు గుర్తుండి ఉండరులే. ప్రభాకర్ నాకు లైనేసేవాడు. ఎర్రగా బుర్రగా ఉండి, బ్యాంక్ ఉద్యోగం చేస్తుండడం వల్ల అతనంటే ఈ బజార్లోని అమ్మా

## మలుపు

యిలకందరికీ మంచి క్రేజ్. అంత క్రేజ్ ఉన్నవాడు నా వైపు చూడడం అప్పుడు నాకు గర్వంగా అనిపించేది.

ఆ కిటికీ దగ్గర కూర్చుని పొద్దస్తమానం



మనింటి వైపే చూసేవాడు. నాకు అలాగే చూడాలి అన్నంత క్రేజ్‌ని కలిగించాడు. ఫలితం నేను కాలేజీ ఎగ్గొట్టడాలు, ట్యూషన్ ఎగ్గొట్టడాలు. ఎగ్జామ్స్‌లో స్కోరుని సంపాదించలేకపోయాను. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో పాల్గొనడానికి కావలసిన సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లేకపోయింది.''

'ప్రభాకరేమయ్యాడు?'' కుతూహలంగా అడిగింది సుజీ నన్ను.

'హు'' అని ఒక నిట్టూర్పు విడిచి ''ఏమయ్యాడు... అతను పెళ్లి చేసుకుని ఈ ఊర్నుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోయాడు''

''అదేంటి, మరి మీ ప్రేమ సంగతి?''

''ప్రేమ... దాన్ని ప్రేమ అనరు సుజీ. టైం పాస్. అతను కేవలం టైం పాస్ కోసమే నా వైపు చూసాడని తరువాత నాకర్థమైంది.''

''ఎలా?''

''ఎలా ఏమిటి? అతను నిజంగా నన్ను ప్రేమించి వుంటే నన్ను ఎలాగోలా కలిసేవాడుగా. అతను రెండేళ్లలో ఒక్కసారి కూడా నన్ను కలిసే ప్రయత్నం చెయ్యలేదని తరువాత ఆలోచిస్తే అర్థమైంది నాకు, అతని గురించి అనుక్షణం ఆలోచిస్తూ నా కెరియర్‌ని పాడు చేసుకున్నానని. దేవుడి దయవల్ల ఆ తరువాత నా తప్పు తెలుసుకుని బి.ఇ.డి., ఎమ్.ఇ.డి. చేసి ఇలా లెక్చరర్‌లా ఉద్యోగం సంపాదించుకోగలిగాను. పెళ్లి చేసుకుని మీ బావలాంటి మంచి వ్యక్తికి భార్యనయ్యాను''

''మా కథ అలాంటిది కాదుగా, పవన్ నన్ను రోజూ కలుస్తూనే ఉంటాడు. మా ప్రేమ సంగతి మా ఇద్దరికీ ఒకళ్లకొకరికి తెలుసుగా!''

''అందుకే చెప్తున్నా సుజి. టీన్స్‌లో ప్రారంభమైన ప్రేమకి అంత బలం వుండదు. పోనీ నిజంగా మీ ప్రేమలో అంత బలమే వుందనుకో. నువ్వు రెండేళ్లు మా ఊర్లో కంప్యూటర్ కోర్స్ చేసినంత మాత్రాన మీ ప్రేమ వాడిపోతుందా? పవన్‌ని నువ్వు మరిచిపోతావా? నిన్ను పవన్ మరిచిపోతాడా? ఇది ఒక రకంగా మీ ప్రేమకు పరీక్షనుకో.''

సుజీ ఆలోచనలో పడింది. నాకు తెలుసు సుజి తెలివైన నిర్ణయమే తీసుకుంటుంది.

ఏది ఏమైతేనేం... సుజి అన్ని విధాలా సుఖంగా వుండడమే నాక్కావలసింది. నాన్నకి సుజిని ఒప్పించిన సంగతి లెటర్ రాయాలనుకున్నాను. పవన్, సుజీల ప్రేమ నిజంగా గట్టిదైతే, ఈ రెండేళ్ల ఎడబాటులో వారిని నేను విడదీసినా, జీవితాంతం ఆ ఎడబాటును తలుచుకుంటూ ఒకరినొకరు ప్రేమకు బందీలవుతారు. పెళ్లి చేసుకుని హాయిగా ఉంటారు- అని మనసులో అనుకుని తేలిగ్గా నిట్టూర్చాను.

-కె. లలితారాజ్ (ఒంగోలు)